పండుగలా.. వైఎస్సార్ సంపూర్ణ పోషణ

గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్

ఏలూరు టౌన్: బాలింతలు, గర్భిణులలకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలోనూ మహిళలకు పెద్దన్నలా అండగా నిలబడుతున్నారు. కుటుంబంలో అక్కాచెల్లెమ్మల ఆరోగ్య సంరక్షణకు బాధ్యత తీసుకుంటూ వారికి పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల విశిష్టతను వివరిస్తున్నారు. తాజాగా బాలింతలు, గర్భిణులకు టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్నారు. ఏలూరు నగరంలోని ఆదివారపుపేట ప్రాంతంలో వీరభద్రరావు కాంప్లెక్స్ వద్ద అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 46వ డివిజన్ కార్పొరేటర్ ఆయేషా సుల్తానా చేతులమీదుగా టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేశారు. మహిళల భద్రత, సంరక్షణ, రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని ఆయేషా వివరించారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో ప్రతి ఒక్కరికీ మేలు చేసేందుకు పథకాలను చేరువ చేస్తున్నామని తెలిపారు.

● వైఎస్సార్ కాలనీ హేలాపురి సిటీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేటర్ నిడికొండ అన్నపూర్ణ, డివిజన్ ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు నిడికొండ నరేంద్ర ఆధ్వర్యంలో మహిళలకు టేక్ హోమ్ రేషన్ కిట్లను అందజేశారు. పేద కుటుంబాలకు సీఎం జగనన్న అండగా నిలుస్తూ గర్భిణులు, బాలింతల సంరక్షణ బాధ్యత తీసుకున్నారని, నాణ్యమైన పౌష్టికాహారాన్ని వారికి అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లిక్, నూకరాజు, లక్ష్మణరావు, పోతురాజు, రమేష్, అయ్యప్ప, వెంకటేష్, సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

● వన్‌టౌన్ 18వ డివిజన్ పరిధిలోని 105 నుంచి 109 వరకూ అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి మహిళలకు వైఎస్సార్ సంపూర్ణపోషణ కిట్లు కార్పొరేటర్ కేదారేశ్వరి, ఇన్‌చార్జి ఇనపనూరి జగదీష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రజలకు ఏమి అవసరమో తెలుసుకుని మరీ సీఎం జగనన్న ప్రతి ఇంటికీ మేలు చేస్తున్నారని జగదీష్ వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నాణ్యమైన పౌష్టికాహారాన్ని బాలింతలకు అందజేస్తున్నారని చెప్పారు.

● తంగెళ్లమూడి ఆదిఆంధ్ర నగరపాలక పాఠశాలలో 50, 51, 52 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ పోషణ కిట్లను కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్ చేతులమీదుగా పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ బి.మంగ ఆధ్వర్యంలో బాలింతలకు బియ్యం, పప్పు, నూనె, గుడ్లు తదితర పౌష్టికాహారాన్ని అందజేశారు.



ఆదివారపుపేటలో కిట్లను అందిస్తున్న కార్పొరేటర్ ఆయేషా



వైఎస్సార్ కాలనీలో కిట్లు అందిస్తున్న నిడికొండ నరేంద్ర, రిజ్వాన్



వన్‌టౌన్‌లో కిట్లు అందించిన ఇనపనూరి జగదీష్



వెంకటాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తల్లిపాల పిల్లలకు బలం

ఏలూరు రూరల్ : పిల్లలు అనారోగ్య బారిన పడకుండా తల్లిపాలు రక్షణ కవచంగా ఉంటాయని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జి.గోవిందరావు అన్నారు. తల్లి పాల వారోత్సవంలో భాగంగా శుక్రవారం వైద్య సిబ్బంది వెంకటాపురంలో తల్లిపాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. గోవిందరావు మాట్లాడుతూ తల్లి పాలు చంటి బిడ్డలకు తేలికగా జీర్ణమయ్యే అనువైన ఆహారం అన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా పెరుగుతారన్నారు. తల్లిపాలు తాగిన పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఆరునెలల పాటు బిడ్డకు జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతుడుగా రూపుదిద్దుకుంటాడని వివరించారు. ఎంపీహెచ్ఈఓ రామాంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్, ఎఎన్ఎం దివ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైఎస్సార్ కాలనీలో వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ నాగేశ్వరరావు

ఏలూరు రూరల్ : వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యారోగ్య అధికారి ఎం నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం వెంకటాపురం వైఎస్సార్ కాలనీలో నిర్వహించిన ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి వ్యాధులు సోకకుండా తీసుకుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. కామెర్లు, అతిసార వ్యాధుల సంక్రమిస్తాయన్నారు. డ్రెయినేజీ మురుగునీరు పారుదల సరిగ్గా లేకపోయిన, తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తిన ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వైఎస్సార్ కాలనీలో ప్రజలు ఈగల సమస్యలను వైద్యులకు వివరించగా, ఈగల సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళతానని డీఎంహెచ్ఓ చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఎంపీహెచ్ఈఓ రామాంజనేయులు, బసవరాజు, కిరణ్, ఏఎన్ఎం దివ్య, హెల్త్ అసిస్టెంట్స్ రమేష్, శ్రీనివాస్, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులకు నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఏలూరు రూరల్: దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతోన్న దాడులను నిరసిస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు శుక్రవారం స్థానిక పాతబస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశాయి. దళితులపై అణిచివేతకు వ్యతిరేకంగా జులై 17 నుంచి ఈ నెల 6 వరకు నిరసన వ్యక్తం చేస్తున్నామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావ్ బహుజన సమాజ్‌వాది పార్టీ జిల్లా కన్వీనర్ నేతల రమేష్ బాబు తదితరులు వివరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో గనులు, సహజ సంపద కార్పొరేట్ సంస్థలకు దోచుపెట్టేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ స్థానిక జాతుల మధ్య విభేదాలు సృష్టిస్తోందని ఆరోపించారు. మతాలు, కులాలు, మైనార్టీలపై దాడులు చేస్తున్నారని దుయ్యబట్టారు. భూమిపై సర్వహక్కులు ఉండే విధంగా జాతీయ సంపదపై ప్రతి ఒక్కరికీ హక్కులు ఉండాలన్నారు. భారత రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరారు.

జూదరుల అరెస్ట్



జూదరులను అదుపులోకి తీసుకున్న ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్, సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ పరిధి హనుమాన్‌నగర్‌లో పేకాట శిబిరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు దాడులు చేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు పర్యవేక్షణలో ఎస్ఈబీ సీఐ ప్రసాదకుమార్ పేకాట శిబిరంపై దాడులు చేశారు. పేకాట ఆడుతున్న 10మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.5 వేలు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్: మండలంలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వై సుజాత, పీఆర్ఏఈ కృష్ణమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, పీహెచ్‌సీ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ గుడివాకలంకలో రూ.40 లక్షలతో చేపట్టిన సచివాలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. సుమారు రూ.14 లక్షలు మండల పరిషత్ నిధులతో చేపట్టిన తాగునీటి చెరువు చుట్టూ కంచె పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఏఈ కృష్ణమోహన్‌ను కోరారు. శ్రీపర్రు, మాదేపల్లిలో నిర్మాణంలో ఉన్న సచివాలయ, ఆర్బీకే, వైఎస్సార్ క్లినిక్ పనులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు.

బిల్లులు చెల్లించండి

నాలుగేళ్ల క్రితం పెదయాగనమిల్లిలో జలజీవన్ మిషన్ నిధులతో పూర్తి చేసిన పైప్‌లైన్ పనులకు నేటికీ బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌ను ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే సైతం దృష్టి సారించారన్నారు. బిల్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటానని ఏఈ చెప్పారు. చాటపర్రు, గుడివాకలంక పీహెచ్‌సీలో రోగులకు అన్ని వసతులు కల్పించాలని, అసౌకర్యం కలగకుండా చూడాలని వైద్యులకు సూచించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోటేశ్వరదుర్గాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడతారన్నారు. చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు, మాదేపల్లి మాజీ సర్పంచ్ కొరపాటి తిరుపతిస్వామి, పెదయాగనమిల్లి గ్రామ పెద్దలు ఎంపీపీని కలిసి పలు సమస్యలను వివరించారు.

కబాడీగూడెంలో అభివృద్ధి పనులు



ఆదర్శనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

ఏలూరు టౌన్: ఏలూరు 49వ డివిజన్‌లో ఎమ్మెల్యే నాని సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. డివిజన్‌లోని కబాడీగూడెం ఆదర్శనగర్‌లో ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా సీసీ రోడ్లు నిర్మాణాన్ని చేపట్టారు. సుమారుగా రూ.15 లక్షల నిధులను ఎమ్మెల్యే నాని మంజూరు చేయగా, వాటిలో ఆదర్శనగర్‌లో రెండు సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. ఈ రోడ్ల నిర్మాణాన్ని కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. కబాడీగూడెం పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు వర్షపునీరు, మురుగునీటి పారుదల లేక తీవ్ర అవస్థలు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే నాని ఆదేశాల మేరకు తంగెళ్ళమూడి ప్రధాన రహదారి, కబాడీగూడెంలోని ప్రధాన డ్రెయినేజీలోని సిల్ట్, వ్యర్థాలను తొలగింపు చేపట్టారు. సుమారుగా రూ.3 లక్షల వ్యయంతో తంగెళ్ళమూడి నుంచీ ముట్లకోనేరు వరకు మురుగునీటి పారుదల సాఫీగా సాగేలా సిల్టు తొలగింపునకు చర్యలు చేపట్టారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు.

ఆక్వా రంగాన్ని ఆదుకోవాలి

ఏలూరు రూరల్ : ఆక్వా రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక అన్నే భవన్‌లో సంఘ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ అధ్యక్షతన జరిగిన ఆఫీస్ బేరర్ల సమావేశ వివరాలను శ్రీనివాస్ వెల్లడించారు. ఆక్వా రంగం ద్వారా దేశం లక్షల కోట్ల రూపాయలు విదేశీ మారక ద్రవ్య ఆర్జిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా సాగు చేస్తున్న రైతాంగాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నేడు చేపలు, రొయ్యలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల పాలౌతున్నారని వివరించారు. రొయ్యలు 100 కౌంట్ ధర రూ.240గా నిర్ణయించినప్పటికీ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. సాగుదారులకు కిలో రొయ్య పెంచేందుకు రూ.180 నుంచి రూ.200 వరకు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. తక్షణం ప్రభుత్వాలు ఆక్వా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి, దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సంఘం సహాయ కార్యదర్శులు కట్టా భాస్కరరావు, బొడ్డు రాంబాబు పాల్గొన్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

శారీరక, మానసిక ఆరోగ్యం అవసరం

జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి



వై20 బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : యువత ఆరోగ్యం, శ్రేయస్సు, అభివృద్ధి కోసం చాప్టర్ వై20 కార్యక్రమం చేపట్టినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. సీఆర్ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, బ్రహ్మకుమారి సంస్థ ఏలూరు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఏలూరు చాప్టర్ వై20 కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొబైల్ వినియోగం, వీడియో గేమ్స్ వల్ల మానసిక అనారోగ్యం కలుగుతుందని, జంక్ ఫుడ్ తినడం కారణంగా చాలా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తొలుత వై20 బ్రోచర్‌ను ఆమె విడుదల చేశారు. బ్రహ్మకుమారీస్ ఏలూరు సెంటర్ నిర్వాహకురాలు బీకే లావణ్య వై20 కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ బ్రహ్మకుమారి సంస్థను పరిచయం చేశారు. ఒక సోషియో, స్పిరిచువల్, వాలంటరీ ఆర్గనైజేషన్‌గా పనిచేస్తూ, విశ్వశాంతి కోసం కృషి చేస్తోందన్నారు. చాప్టర్ వై20 కార్యక్రమం ఈ ఏడాది నవంబర్ 30 వరకు ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. అనంతరం డాక్టర్ ప్రేమ మసంద్ మాట్లాడుతూ లైఫ్ ఈజ్ ఏ గేమ్ ఆఫ్ ఛాయిసెస్ అని, మన మైండ్ కండిషనింగ్ వల్ల మన స్వభావం తయారవుతుందన్నారు. మన ఆలోచన సరళి పాజిటివ్, పవర్ ఫుల్‌గా, పర్పస్ ఫుల్‌గా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తమతో తాము మాట్లాడాలని, అలా మాట్లాడటం వల్ల సానుకూలంగా, ప్రతికూలంగానూ పనులు జరుగుతాయన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ వల్ల అనేక పనులు సాధ్యపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ ప్రేమ మసంద్ సమాధానాలు ఇచ్చారు. సిస్టర్ బీకే వాణి విద్యార్థులతో మెడిటేషన్ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

మెడిటేషన్, వ్యాయామం అలవర్చుకోవాలి

ఏలూరు మెట్రో / ఏలూరు (ఆర్ఆర్‌పేట): అధిక ఒత్తిడితో కూడిన జీవన శైవలిలో మహిళలు ఎక్కువ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, వీటన్నింటి నుంచి మెడిటేషన్, వ్యాయామం ద్వారా ఉపశమనం పొందవచ్చని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఏలూరు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా కుటుంబం సభ్యుల శ్రేయస్సు కోసం ఆలోచిస్తారని, వారి ఆరోగ్యం కోసం ఆలోచించరని అన్నారు. వీరు ఎక్కువ ఒత్తిడి లోనవ్వకుండా మెడిటేషన్, వ్యాయామం చేయాలని సూచించారు. కేన్సర్ వంటి రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు పద్మశ్రీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డా.ప్రేమ్ మసంద్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సూర్య చక్రవాణి, ప్రజాపిత బ్రహ్మ కుమరీస్ ఏలూరు శాఖ నిర్వహకరాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుల వినతి



డీఈఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లాలో 1998 డీఎస్సీలో అర్హత సాధించి మినిమమ్ టైమ్ స్కేల్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష,, కార్యదర్శులు పగడాల సాంబశివరావు, వడ్లమూడి రామ్మోహన రావు, ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ మాట్లాడుతూ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు వారి మండలాలకు దగ్గరగా పోస్టింగులు ఇవ్వాల్సి ఉన్నా కొందరికి 80 నుంచి 90 కిలోమీటర్ల దూరంలో పోస్టింగులు ఇవ్వడం వల్ల వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని డీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. సమీప మండలాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరామన్నారు. ఎయిడెడ్ సంస్థల్లో పనిచేసిన వారిని మెర్జింగ్ వల్ల వారిని కూడా చాలా దూరాలకు బదిలీ చేయడం కారణంగా వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొత్తగా పదోన్నతులు పొందిన వారు రెండు నెలల నుంచి జీతాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, సాంకేతిక కారణాలను సరిచేసి వారికి జీతభత్యాలు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి డీఈఓ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

● ఆసుపత్రిలో పింఛన్ పంపిణీ



తణుకులో సూరబత్తుల లక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ వీరమణి

తమకు కేటాయించిన ఇళ్లలో పింఛన్ అందించడమే కాకుండా ఎవరికైనా అనారోగ్యం కారణంగా వేరే ప్రాంతంలో చికిత్స పొందుతున్నవారి వద్దకూ వెళ్లి పింఛన్ అందిస్తున్నారు వలంటీర్లు. ఏలూరు 35వ డివిజన్‌లో నివసించే సూరబత్తుల లక్ష్మి తణుకులో అనారోగ్యం కారణంగా తమ బంధువుల ఇంట్లో చికిత్స పొందుతోంది. ఆమెకు నక్కిన వీరమణి తణుకు వెళ్లి పింఛన్ అందించింది. ఏలూరు చొదిమెళ్లలో నివాసం ఉండే చావలి శ్రీరామచంద్రమూర్తి తాడేపల్లిగూడెంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వద్దకే వలంటీర్ బి.భుజంగరావు వెళ్లి పింఛన్ అందించారు. పింఛన్ అందించినందుకు వలంటీర్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



తాడేపల్లిగూడెంలో శ్రీరామచంద్రమూర్తికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ భుజంగరావు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు -బీహెచ్ఈఎల్	08.00	4794	33
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	28
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

నిర్వాసితులకు కేంద్రం న్యాయం చేయాలి

ఏలూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు నిధులు వెంటనే మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం రవి ఓ ప్రకటనలో కోరారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ ఆగస్టు 7న ఢిల్లీలో చేపట్టబోయే ధర్నా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం గుర్తించినందున కేంద్ర ప్రభుత్వమే నిర్వాసితులకు నిధులు చెల్లించాలని కోరారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం ఏర్పాటుచేయకపోవడం వల్లే నేటికీ ఏటా వచ్చే వరదలకు ప్రజలు ముంపుబారిన పడుతున్నారని ఆరోపించారు. వరదల వల్ల ప్రజలు పడే కష్టాలు వర్ణణాతీతం అన్నారు. ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులను ఆదుకోవడం ప్రభుత్వం కనీస ధర్మం అన్నారు. పోలవరం నిర్వాసితుల కోసం సీపీఎం పోరాటం చేస్తోందన్నారు. ఇందులో భాగంగా జూన్, జులై నెలల్లో పోరుకేక పేరుతో విజయవాడలో మహాపాద యాత్ర నిర్వహించామని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు గుర్చి మాట్లాడుతుండే తప్ప నిర్వాసితులు పరిహారం, సహాయం చేయడం లేదని ఆరోపించారు.

నిర్వాహకుడి అరెస్ట్ : విటులపై కేసు



హనుమాన్ నగర్‌లోని వ్యభిచార గృహం

ఏలూరు టౌన్ : ఏలూరు రూరల్ పరిధి హనుమాన్ నగర్ సమీపంలోని కొత్తూరు వంతెన వద్ద ఓ ఇంట్లో గుట్టుగా సాగుతోన్న వ్యభిచారం గుట్టురట్టు అయ్యింది. ఆన్‌లైన్‌లో యువతులను బుక్ చేసుకునేలా గత కొంత కాలంగా వ్యభిచారం సాగుతున్నట్టు తెలుస్తోంది. ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్, ఏలూరు రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణబాబు తమ సిబ్బందితో వ్యభిచారం సాగిస్తోన్న ఇంటిపై శుక్రవారం దాడి చేశారు. నిర్వాహకుడితో పాటు మరో నలుగురు విటులను పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ, గన్నవరం తదితర ప్రాంతాల నుంచి యువతులను ఏలూరు నగరానికి రప్పించి శివారు ప్రాంతంలో ఇంటిని అద్దెకు తీసుకుని, వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బాధిత యువతులకు కౌన్సిలింగ్ ఇచ్చి సంరక్షణ కేంద్రాలకు పంపారు. వ్యభిచార కేంద్రం నిర్వాహకుడు బాలచందర్, మరో నలుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా పెంచామని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు.